ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభివృద్ధిపై అన్ని విభాగాల అధికారులతో సమావేశమైన సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జూన్ 3: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష సమావేశం మంగళవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బక్రీద్ పర్వదిన ఏర్పాట్లు, పాఠశాలలు తెరుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, టాక్స్, హౌసింగ్ సమస్యలు, అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఎదురుకావడం శోచనీయమని తెలిపారు. నిధుల కేటాయింపుతో నిమిత్తం లేని అన్ని సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాలా పూడిక తీత వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని మున్సిపల్ డివిజన్లలో అత్యవసర బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదకరంగా నిలిచిన విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని అన్నారు. అడ్డగుట్ట, లాలాపేట, ఎరుకలబస్తీ ఫంక్షన్ హాల్స్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, స్విమింగ్ పూల్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. సుభాష్ చంద్ర బోస్ నగర్, దోభీఘాట్‌లలో డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం అర్హులైన దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. మేడిబావి నివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం, లాలాగూడలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు విద్యుత్ సరఫరా కల్పించాలని అన్నారు. శాస్త్రినగర్‌లో రుద్రవీణ సంస్థ అభ్యర్థనకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్, సేవాలాల్ మహారాజ్ భవనం నిర్మాణానికి ఏర్పాట్లు జరపాలని కోరారు. వివిధ విభాగాల మధ్య గ్రూప్ సందేశాలకు వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు హేమ, శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి తమ డివిజన్ల పరిధులలో పలు సమస్యలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, జీహెచ్ఎంసీ ఎస్ఈ ఆశలత, పలు విభాగాల అధికారులు సుబ్రమణ్యం, వెంకటేష్, రవీందర్, శ్రీనాథ్, జీఆర్‌కే రెడ్డి, సువర్ణ, గణేష్, కిష్టయ్య, సంధ్య, లావణ్య, సునీత, హేమలత, డాక్టర్ మారుతి, కె.రోహిణి, సుదర్శన్, తహసీల్దార్ భీమయ్యగౌడ్, ప్రతాప్‌రెడ్డి, మహేష్, డాక్టర్ కె.శ్రీకాంత్, డాక్టర్ వందన, డాక్టర్ జయశ్రీ, రేషనింగ్ అధికారులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, ఎల్ఎల్ఎం, డేటా సైన్స్ కోర్సు పరీక్ష ఫలితాలతో పాటు ఎంఈ, ఎంటెక్ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు.

దూరవిద్య ఎంసీఏ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ అన్ని సెమిస్టర్‌లో మెయిన్, బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

డిగ్రీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కుల మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీరివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 9వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుంతో 11వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 11వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈ నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుంతో 17వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

బీఈ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తిచేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని చెప్పారు. 2000 ఏడాది తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈ నెల 13వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో కలిపి 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.omania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

కవాడిగూడ, జూన్ 3: ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్ ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, గాంధీనగర్ కార్పొరేటర్ పావనితో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద యువతుల పెండ్లి కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రూపొందించి అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మొత్తం 159 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించగా అదులో 97 షాదీముబారక్, 62 కల్యాణలక్ష్మి చెక్కులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం.. వ్యక్తి రిమాండ్

బొల్లారం, జూన్ 3: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసానికి పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం న్యూ బోయిన్పల్లి బాపూజీనగర్‌కు చెందిన కొల్లాపూర్ శ్రావణ్‌కుమార్ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లతోపాటు వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని పరారయ్యాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నార్త్ జోన్, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. నిందితుడు చేసిన నేరాలను ఒప్పుకొన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నూతన విగ్రహాల ఏర్పాటుకు కృషి

సీతాఫల్‌మండి చౌరస్తాలో అధికారులు కార్పొరేటర్లతో కలిసి అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, జూన్ 3: సీతాఫల్‌మండి కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రాం నూతన విగ్రహాలను తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండిలో మంగళవారం కార్పొరేటర్లు, అధికారులతో కలిసి విగ్రహాల ఏర్పాటు ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల సుందరీకరణ, పచ్చిక బయళ్ళ ఏర్పాట్లు జరపాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆశలత, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈఈ స్వర్ణలత, ఏఈ కౌశిక్, కార్పొరేటర్లు హేమ, శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణపై అవగాహన పెంచుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయశ్రీ

అడ్డగుట్ట, జూన్ 3: అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లాలాపేట్ ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ 100 రోజుల వరకు జరిగే ఈ క్యాంపులో ప్రధానంగా మురికివాడల్లో, ఓల్డ్ ఏజ్ హోమ్స్, నైట్ షెల్టర్స్‌లో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం లాంటి సమస్యలు ఉంటే తక్షణమే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలను నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరిత, రాజు, జగత్‌కుమార్, సుబ్బారావు, జయసింహ, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పద్య నాటకం

కళాకారులను సత్కరించిన సాహితీవేత్త ఓలేటి పార్వతీశం

ముషీరాబాద్, జూన్ 3: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరుగుతున్న పద్య నాటక ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు పాండవోద్యోగము-పాండవుల ఉపప్లావ్య ఘట్టము నాటక ప్రదర్శన కనువిందుగా సాగింది. వెంకటకృష్ణ, బి.నారాయణస్వామి, మల్లాది వెంకటరమణ, రాశుల లింగ య్య, రామ్మోహన్‌రావు వివిధ పాత్రలో నాటకాన్ని రక్తి కట్టించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను సత్కరించారు. కిన్నెర ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి మద్దాలి రఘురాం, దైవజ్ఞశర్మ, ఉమర్‌ఖాన్, సాంబశివరావు, రఘుశ్రీ, ఆరాధ న సంస్థ అధినేత కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా శానిటేషన్ డ్రైవ్

శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, జూన్ 3: పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సూచించారు. మంగళవారం అడ్డగుట్టలో శానిటేషన్ డ్రైవ్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో మూడు రోజులపాటు శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతుందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడమే తమ లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, మోహన్, శ్రీశైలం, కుమార్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

5న ఎస్పీ బాలసుబ్రమణ్యం కీర్తి పురస్కారాలు

ముషీరాబాద్, జూన్ 3: శృతిలయ ఫౌండేషన్, సిల్ వెల్ కార్పొరేషన్, గుత్తా వెంకటరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఎస్పీ బాలసుబ్రమణ్యం స్ఫూర్తి పురస్కారాలు అందించనున్నట్లు నిర్వాహకులు బండారు సుబ్బారావు, ఆమని ఒక ప్రకటనలో తెలిపారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరగనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, గుప్త అమిత్‌రెడ్డి తదితరులు హాజరు అవుతారని తెలిపారు.

భవనం పైనుంచి కిందపడి కార్మికుడు మృతి

బొల్లారం, జూన్ 3: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం బోయినపల్లి అయ్యప్ప సొసైటీలో నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన బీహారీ పారకీ రౌత్ మరణించినట్లు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న బోయినపల్లి పోలీసులు ఎలా చనిపోయాడనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి తల, ఒంటిపై గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన రౌత్ మృతదేహాన్ని ఘటనాస్థలిలో క్లూస్ టీమ్స్ పరిశీలించి ఆధారాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న బోయినపల్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

నకిలీ వైద్యుడు అరెస్ట్

బేగంపేట్, జూన్ 3: విద్యార్హతలు, అనుమతులు లేకుండా క్లినిక్ కొనసాగిస్తున్న నకిలీ వైద్యుడిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జయచందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేగంపేట పోలీసు స్టేషన్ పరిధి అన్నానగర్‌లో నకిలీ వైద్యుడు ఆసుపత్రి నిర్వహిస్తున్నాడనే సమాచారంతో ఎస్సై వరలక్ష్మి నేతృత్వంలో సిబ్బందితో కలిసి సోమవారం జి.మహేందర్ నిర్వహిస్తున్న క్లినిక్‌పై ఆకస్మికంగా దాడి చేశారు. అతని వద్ద ఎటువంటి విద్యార్హత పత్రాలు లేవని, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన మహేందర్ ఎటువంటి విద్యార్హతలు, పత్రాలు లేకున్నా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వైద్యం చేస్తూ, మందులను రాసిస్తున్నట్టు తేలింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి క్లినిక్‌లో వైద్య పరికరాలు, ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఘనంగా మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదిన వేడుకలు

పుస్తకాలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

శిబిరాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలను ఓయూలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజు ఆధ్వర్యంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగులకు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి వైద్యం, ఇరిగేషన్ రంగాల్లో తనదైన ముద్రవేసి, తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తూ బంగారు తెలంగాణ నిర్మాణం కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి హరీష్‌రావు అని ప్రశంసించారు. ప్రతిపక్షంలో పోరాడుతూ కాంగ్రెస్ చేసిన మోసాలపై యుద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పెద్దమ్మ రమేష్, జంగయ్య, శ్రీకాంత్‌ముదిరాజ్, నాగేందర్‌రావు, అవినాష్, ప్రసాద్, ఆదర్శ్, జ్యోతి, సింధు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల రక్తదానం

ముషీరాబాద్, జూన్ 3: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు జన్మదినం పురస్కరించుకొని ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎం.నగేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరీష్‌రావును విమర్శించే నైతిక హక్కు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు లేదని, ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిస్తే మహేష్‌కుమార్ ఇంతవరకు ప్రజాప్రతినిధి కాలేకపోయారని విమర్శించారు. లాటరీ పద్ధతిలో పీసీసీ అధ్యక్షుడైన ఆయన తన స్థాయిని మరిచి విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. అవగాహన రాహిత్యంతో కాళేశ్వరం విషయంలో మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రాలు విదేశాల నుంచి వచ్చిన ప్రతివారు కాళేశ్వరం గొప్పతనాన్ని కొనియాడరని, అయినా కాంగ్రెస్ వాళ్లకు కండ్లు కనపడకపోవడం శోచనీయమన్నారు.

అన్నదానం ప్రారంభం..

మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. మహమ్మద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేష్‌ముదిరాజ్, శ్యాంసుందర్ చిట్టి, నేత శ్రీనివాస్, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య నీరాజనం

చిన్నారులను అభినందిస్తున్న నిర్వాహకులు

చిక్కడపల్లి, జూన్ 3: ఆండాలు కూచిపూడి నాట్యాలయ ఆధ్వర్యం లో శ్రీ సచ్చిదానంద కళాపీఠం అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు కె. రత్నాకర్‌శర్మ ప్రథమ వర్ధంతి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సిటీ కల్చరల్ సెంట ర్లో నిర్వహించారు. బాల సచ్చిదానందం చిన్నారులచే సంగీతం నృత్య నీరాజనం ఆకట్టుకుంది. కూచిపూడి నాట్యాలయ అధ్యక్షురాలు కాందాల హరిణి వివిధ కళా సంస్థల సమన్వయంతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రసమయి సంస్థ అధ్యక్షు డు బాలబందు డాక్టర్ ఎంకే రాము, సినీనటుడు వేణు పొల్సాని హాజరయ్యారు. బాల పరిమళం అవార్డులను అందజేసి ప్రోత్సహించి తీరు అభినందనీయం. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది నేరెళ్ల మాల్యాద్రి, సంగీత గురు శంభుని మయూరి, నరేష్ పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ వేడుకలు ప్రారంభం

బొల్లారం, జూన్ 3: ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం మంగళవారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ప్రారంభమయ్యాయి. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు వర్క్‌షాపుల్లో మట్టి కుండల తయారీ, వ్యర్థ పదార్థాలతో వినూత్న వస్తువుల తయారీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, టెర్రకోట నగల తయారీ, అగ్ని వేయకుండా వంటకాల తయారీ, డ్రోన్ మేకింగ్ తయారీ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు రాష్ట్రపతి నిలయం అధికారి రజనీప్రియ తెలిపారు. నేటి నుంచి ఈ నెల 5 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు వర్క్‌షాప్ నిర్వహణ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు రాష్ట్రపతి నిలయం వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని, నమోదు సహాయం కోసం విజిటర్ ఫెసిలిటేషన్ సెంటర్ 040-23560518ను సంప్రదించాలని కోరారు.

స్టాంప్ ధరలు తగ్గించాలి

బన్సీలాల్‌పేట్, జూన్ 3: సంక్షేమ నిధి స్టాంప్ ధర రూ.200 వందలకు తగ్గించాలని తెలంగాణ అడ్వకేట్ నోటరీ అసోసియేషన్ అధ్యక్షుడు గంజి యాదగిరి అన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైకోర్టులోని బార్ కౌన్సిల్ కార్యాలయ కార్యదర్శి నాగలక్ష్మిని కలిసి వినతిపత్రాన్ని అందజేశామని ఆయన తెలిపారు. సంక్షేమ నిధి స్టాంప్ ధర రూ.100 మాత్రమే ఉండేదని, తాజాగా రూ.250కి పెంచారన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధి ప్రయోజనాన్ని రూ.12 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.అనిల్‌కుమార్, ఇంతియాజ్, కోశాధికారి ఏబీ నర్సింగ్‌రావు, కార్యదర్శులు కె.మురళీధర్, మయబ్రహ్మ నరసింహ, కె.నరసింహారావు, ఎం.వెంకటేష్, సభ్యులు పి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

చెక్ పోస్టులను తనిఖీ చేసిన డీసీపీ

చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

ఉస్మానియా యూనివర్సిటీ/అడ్డగుట్ట, జూన్ 3: బక్రీద్ సమీపిస్తున్న వేళ లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి మంగళవారం తనిఖీ చేశా రు. ఆయన మాట్లాడుతూ చెక్ పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది అత్యంత అప్రమత్తతతో ఉండాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శశాంక్‌రెడ్డి, లాలాగూడ సీఐ రఘుబాబు, ఎస్సైలు షాహిద్ పాషా, గంగాధర్ పాల్గొన్నారు.

పీసీబీ పోస్టర్ ఆవిష్కరణ

అమీర్‌పేట్, జూన్ 3: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అంశంపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం సంస్థ సభ్య కార్యదర్శి రవితో కలిసి ఆవిష్కరించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించామని పేర్కొన్నారు. స్థిరమైన పద్ధతులను అవలంబించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం, సమర్థవంతమైన పద్ధతుల ద్వారా వ్యర్థాల నిర్వహణ అవసరాన్ని మంత్రి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

సంఘ సేవకుడు ధర్మారావుకు సన్మానం

చిక్కడపల్లి, జూన్ 3: అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సినీసేవా, ప్రముఖ సంఘ సేవకుడు సంస్కృతిరత్న కె.ధర్మారావు, సూర్యకుమారి దంపతులకు సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రముఖ సాంస్కృతిక సేవామూర్తి వంశీ రామరాజు, ప్రముఖ దర్శకుడు రేలంగి నసింహారావు ధర్మారావు దంపతులను సన్మానించారు. అన్నమాచార్య భావనా వాహిని వ్యవస్థాపకులు శోభారాజు, మృదంగ సామ్రాట్ యల్లా వెంకటేశ్వరరావు, ఓలేటి పార్వతీశం, జేకే భారవి, పి.కమలపరసాద రావు, సి.రామకృష్ణ పాల్గొన్నారు.